

ఆదివారం నాల్గింటి నుంచే మా 'సుందరి'ని ఫస్ట్‌షో సినిమాకి తయారు చేస్తున్నాను. తయారు చేస్తున్నాను అంటే మొహం కడిగి, చీరకట్టి, జడవేసి, పౌడర్ అద్దుతున్నానని కాదు. ఆవిడ అదే మా ఆవిడ ఆ పనులు చేసుకొంటూవుంటే జస్ట్ సాయపడుతున్నానంతే! బీరువా లోంచి చీరె కాంబినేషన్ బ్లవుజ్ సెలెక్ట్ చేసివ్వడం, జడ అల్లుకుంటూనంటే, హేరాయిల్ దువ్వెనా అందివ్వటం వగైరా వగైరా!! అప్పుడప్పుడు అదనంగా కాఫీ పెట్టివ్వడం లాంటివి మా ఆర్నెల్లకొత్త కాపురంలో చాలా మామూలు విషయాలు. ఎలాగయినా భార్యంటూ ఉంటే ఇలాంటి సుఖాలు (అవస్థలు?) తప్పవుకదా!



ఈ ఆర్నెల్లలో మేము రెండు సార్లు మాత్రం పోట్లాడుకున్నాము. పాపం మా సుందరికి సినిమాలంటే మహా పెద్ద యిష్టం. నాకేమో గత పది సంవత్సరాలుగా పాతమొహాలను చూసి చూసి విసుగెత్తి ఇప్పుడు వస్తోన్న కొత్త మొహాలను చూసి విరక్తొచ్చి, సినిమాకి వెళ్ళి ఆబాధపడలేక ముందు సీట్ల వారిమీద కావాలనికాదు కానీ వాంతి చేసుకొనే వరకూ వచ్చింది. దాంతో సినిమాలు చూట్టం మానేశా! సుందరితో పెళ్ళి అయ్యాకనే మళ్ళీ సినిమాలు చూట్టం మొదలు పెట్టా. నేను రాను అంటే సుందరి బాధపడిపోయి, ఆ తరువాత అలకపాన్పెక్కుతుంది. ఇహ ఆరోజు నోఫుడ్,... అవుట్ సైడ్ బెడ్... ఆ బాధ భరించలేక, సినిమాలు చూట్టం మొదలెట్టా. జేబులో రెండు నిమ్మకాయలు రెడీగా ఉంచుకుంటూ... సినిమా చూస్తున్నప్పుడు వాంతి వచ్చేలావుంటే నిమ్మకాయను కసాబిసా నమిలెయ్యమని మా వెంకట్రావు సలహా! గుర్తుకుతెచ్చుకుని జేబులు తడుముకున్నా. అవి జాగ్రత్తగానే ఉన్నాయ్.

ఓ రకంగా కాదు, రెండు రకాలుగా చూసినా మాయింటి వెనకాల ఉండే వెంకట్రావే అదృష్టవంతుడనుకుంటా. భార్యా బాధితుడు కాదు. అసలు పెళ్ళి చేసుకున్నాడో, పెళ్ళాన్ని వదిలేశాడో, లేకపోతే పెళ్ళామే ఈయన్ని వదిలేసిందో తెలీదు. అంతా మిస్టరీ... ఎప్పుడయినా ఆ విషయాన్ని కదిపితే చాలా తెలివిగా తప్పుకుంటాడు. స్టవ్‌మీద అన్నం పొంగుతుందనో బెండకాయవేపుడు మాడిపోతోందనో...! యాభయ్ సంవత్సరాలున్నా దుక్కలా ఉంటాడు. అరకేజి బెండకాయ కూర అవలీలగా లాగేస్తాడు, మా ఇంట్లోంచి తీసికెళ్ళిన మునక్కాడ పులుసు నంజుకుంటూ...

ఇలా నేను వెంకట్‌రావు ఆలోచనల్లో ఉండగా పాడయిపోయిన రైలింజన్ కూతలా ఈః ఛ్... మని విపరీతమయిన శబ్దం వచ్చింది. ఎవరా అని చూస్తే మా ఇంటి ఓనరు కొడుకు. వాడు ఏడుపును అలా పలికిస్తుంటాడు ఎలా ఏడ్చి ఏడవాలో తెలీక. వాడు అలా కూతవేసి ఏడ్చి తగలడినప్పుడల్లా నాకెందుకో గుండెలు దడదడలాడతాయి. అసలే సినిమా తొందర్లో ఉన్నాను. మా ఆవిడేమో తొందరగా తెమల్దా. వాచీకేసి చూస్తే 4.30 కావస్తోంది. సినిమా టికెట్లు దొరుకుతాయో లేదో.. అదో దిగులు. అదీ ఆదివారం నాడు. దేశంలోని ముప్పాతిక శాతం జనాభా అంతా సినిమా హాళ్ళ దగ్గరే ఉంటారనుకుంటా... అసలు అభిమాన సంఘాల వారికి ఇచ్చినట్లు, కొత్తగా పెళ్ళయిన వారికి కూడా కొంత టికెట్ల కోటా ఇస్తే బావుణ్ణేమో.. నా ఆలోచనకు నాకే నవ్వొచ్చింది. అసహనంగా ఇంట్లోకి చూశాను. మా సుందరి ముచ్చెళ్ళు సవరించుకొంటోంది. ఇంతలో వెంకట్‌రావు అటు రావడంతో పక్కకు తప్పుకుంది. అన్నిటికీ అడ్డమొస్తాడు వెధవ. "ఏంసార్ పెళ్ళేమయినా అమ్మకానికొచ్చాయా?" అని పలకరించాడు. వీడిది కడుపా బంగాళా ఖాతమా? అన్పించింది. పొద్దునే అరకిలో మాంసం తెచ్చుకుని ఫ్రై చేసుకుని తిని ఏడ్చాడు వెధవ... 'మాకేదండీ' విసుగ్గా సమాధానం చెప్పాను. అసలే మా ఆవిడ తెమల్లేదని విరాసు.

"ఏమిటి మూడీగా ఉన్నారు. సినిమా ప్రోగ్రామా" అని సుఖంగా సకిలించాడు.


ఊళ్ళోవస్తే వీడికే కావాలి వెధవన్నర వెధవ అనుకుంటూ "అవునండీ, ఆదివారం కదా!

మీరూ వస్తారేంటి'' రాకూడదనీ మనసులో అనుకుంటూ.

''లేదండీ, ఇవాళ బాగా రష్‌గా ఉంటుంది కదా... నాకూ ఓపిక లేదు. హాయిగా ఇంటి దగ్గరుండి ఫిష్ క్రర్రీ చేసుకుతిందామని ఉందం డీ. నాలిక మరీ మొద్దుబారిపోయింది. అయినా నమ్మరుగానీ మాస్టారూ... కడుపునిండా భోం చేసి ఎన్నాళ్ళయిందో కదా?'' అని జాలిగా మొహం పెట్టాడు.

నాకు నవ్వాలో ఏడవాలో తెలీక ''సుందరీ, రెడీయా'' అని మా ఆవిడ్ని కేకేశాను.

''ఓ రెడీ'' అంటూ ముందుకొచ్చింది. హమ్మయ్య! అని స్కూటర్ తాళం తీయబో యాను. ఇంతలో మా ఇంటి ఓనర్ వాళ్ళబ్బా య్ పరుగెత్తుకుంటూ వచ్చి ''అంకల్ సినిమా కెళ్తున్నారా? మేమూ వస్తున్నాం... నేనేమో మీ స్కూటర్‌మీద, మా మమ్మీ డాడీ, మా అక్క మా విక్కీమీద సరేనా'' అని ... నా సమాధానం కోసం ఎదురు చూడకుండా ''ఇ దుగో ఫైవ్ మినిట్స్‌లో వచ్చేస్తానుండండి'' అంటూ వెళ్ళి ఇంట్లోకి తూనీగలా పరుగెత్తా డు. ఫైవ్ మినిట్స్ కాస్తా పావుగంటయింది. పోనీ పిలుద్దామంటే మళ్ళీ ఈ...వ్...మని కేకపెట్టి నాగుండెలను అదరగొడ్తాడేమోనని భయం... 'థాంక్యూ అంకల్...' అంటూ స్కూటర్ ముందు నిలబడ్డాడు. ఈవ్ వెధవ ఇక పోనీమన్నట్టు... అసలే మొదటి ఆట సిని మా. పానకంలో పుడకలా ఈ శనిగ్రహమేమిటి అన్నట్టు కొరకొరా చూస్తోంది మా ఆవిడ. ఈవ్‌గాడు మాత్రం తనకేం పట్టనట్టు నిలబడ ఛంతో నేను స్కూటర్‌కి కిక్కిచ్చి ముందుకు నడిపా!




## రెండే రెండు!

'మా వాడికి అన్ని మంచి లక్షణాలే ఉన్నాయి... కానీ... రెండు మాత్రం...'

'ఏవిటా రెండు?' అడిగాడు నవనీ తం.

'తనకు తెలియదు! ఒకరు చెబితే వినదు!' చెప్పాడు గోవర్ధనం.

రాయవరపు రవి, రామాయంపేట

రెండు ఫర్లాంగులు వచ్చామో లేదో మినిస్ట రుగారు వస్తున్నారని ట్రాఫిక్‌ను జామ్ చేస్తు న్నారు పోలీసులు. ఇక లాభం లేదు. వాంఛొచ్చేవ రకు ఫస్ట్‌షో సినిమా పూర్తయిపోతుందని ఏ క్యాంప్ సందుల్లోంచి గొందుల్లోంచి ఉడ్‌లాం డ్స్ దగ్గరకి చేరాము. రాజ్ విహార్ దాటి కాస్త అవతలికి వెళ్ళగానే శవాన్ని తగలబెట్టి తిరిగి వస్తున్నట్టుగా వెనక్కి తిరిగి వస్తోన్న జనాన్ని చూడగానే అర్థమయిపోయింది నాకు టికెట్లు అయిపోయాయని. అయినా సరే థియేటర్ దగ్గరకి పోనిచ్చా 'హౌస్‌ఫుల్' అనే పెద్ద బోర్డు కనిపించింది. మొదటి రౌండులోనే నేలకూలిన సైనికుడిలా ఉంది నా పరిస్థితి. ఇంతలో తుస్ మని శబ్దం వచ్చింది. సడన్‌గా స్కూటర్‌కు బ్రేక్ వేసి చూశాను. టైర్ పంచరయ్యిందేమో నని. నేనలా వెనక్కి తిరిగి చూడగానే టైరేం పంచరవ్వలేదు. నేనే... నిట్టూర్చాను లెండి'' అంది మా సుందరి పరమ ఉక్రోషంగా!


ఇంటికి వెళ్ళగానే జరిగేది ఏవిటో తెలుసు నాకు. పోనీ మరో సినిమాకు బయల్దేరదామం టే శనిగ్రహం లాంటి ఈవ్ గాడున్నాడు. వీడ్ని ఇక్కడే వదిలేసి వెళ్తే వాళ్ళ నాన్న వచ్చి పికప్ చేసుకుంటాడులే అనుకుని ''నువ్విక్కడే ఉం డు బాబూ మీ నాన్న వస్తారు'' అనేసరికి ఏడ్పు లంకించుకుని భూనభోంతరాలు బద్దలయ్యే ట్టు ఈ....వ్...వ్...మని అరిచేసరికి అక్కడి జనమంతా స్కైలాబ్ పడిపోయినంత ఖంగా రు పడ్డారు. ఐస్క్రీమ్, చాక్లెట్లు, నానా గడ్డి కొనిచ్చి వాడి శోకాన్ని ఆపడానికి నేను హైరానా పడ్తోంటే, ఉరుముల్లాంటి శబ్దాలతో పాడయి పోయిన మున్సిపాలిటీ వారి ట్రాక్టరులా వచ్చి ఆగింది మా వానరుడి (ఇంటిఓనరు) వాహ నం సతీ, పుత్రికా సమేతంగా!

''ఏంటి గురూ టిక్కెట్లు అయిపోయా యా? ఏమిటి? అని కిచకిచమనే శబ్దంతో పండ్లికిలిస్తున్నాడు.

ఆ కిళ్ళీ పళ్ళు రాలగొడ్తామన్నంత కోపమొ చ్చింది. నా బొందటికెట్లు. మీ శనిగ్రహం లేకపోతే వేరే సినిమాకన్నా వెళ్ళే వాళ్ళం అని అరిచి మరీ చెబ్దామనుకున్నానుకానీ అనవసర కోపం అనర్థదాయకమని గుర్తొచ్చి (ఉన్నపళాన ఇల్లు ఖాళీ వెయ్యమంటే) ''అబ్బేలేదండి హౌస్ ఫుల్'' అన్నాను. ముందు బయల్దేరి వచ్చిన వాడివి సినిమా టికెట్లు కూడా సాధించలేకపో యావు ఏం మగాడివయ్యా! అన్నట్టుగా ఉన్నా యి ఆయన శ్రీమతి గారి చూపులు.

మళ్ళీ మా వానరేశ్వరుడు కిచకిచమని న వ్వి ''అలంకార్‌లో ట్రై చేద్దాంపద'' అంటూ బయల్దేరదీయించాడు. అక్కడ నటశేఖర, ద ర్శకరత్న కలిసి నటించిన సరికొత్త సినిమా రిలీజయి ప్రేక్షకులు పోలీసులు, అభిమానులు, ఒకళ్ళమీద ఒకళ్ళు పడి బట్టలు చించేసుకుం టున్నారు. ఇంకాసేపు ఇక్కడే ఉంటే మా బట్టలు కూడా చించేస్తారేమోనని నేను గబాల్ని స్కూటర్‌ని పక్కకి మళ్ళించా ఇంతలో మాం చి వయసులో ఉన్న ఓ అమ్మాయి ''మూడ్రూ పాయల్. ఆర్రూపాయల్'' అంటు మా సుం దరి మొహం దగ్గరపెట్టి ''రెండే ఉన్నాయ్ తీసుకోండమ్మా'' అంటోంది.

వెనకే వచ్చి ఆగాడు మా వానరేశ్వరుడు. ఇక లాభంలేదు. ఇంతమందిని వదిలేసి సినిమా కెళ్ళటం భావ్యంకాదని నా(మా)సుఃఖాన్ని శా క్రిఫైజ్ చేసేసి స్కూటర్‌ని స్టార్ట్‌చేశా! ఈ మొహానికి సినిమా చూపెట్టడం కూడానా? అన్నట్టుంది నా అర్ధాంగి వాలకం. శనిగాడు



మాత్రం ఇంకా ఐస్‌క్రీమ్‌ను తదేకంగా వీకు తూనే ఉన్నాడు.

మా ఆవిడ ముఖం మాట్టానికి కూడా భయంగా ఉందినాకు. ఎలాగయినా ఆమెను ప్రసన్నం చేసుకోవాలని తెగ ఆలోచించా ఆమెకు ఏం ఇష్టమా... అని... ఠకీమని గుర్తుకొచ్చింది ఆమెకు చెరుకురసమంటే ఇష్టమని..వెంటనే పాత బస్టాండు వేపుకు బయలుదేరి గాల్సు కాలేజీ దగ్గరికి వచ్చేసరికి అక్కడేదో యాక్సిడెంట్ అయి ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయి ఉంది. సర్లెమ్మని రాధాకృష్ణ టాకీసు ముందకొచ్చేసరికి గేటు తెరిచే ఉంది. బతుకు జీవుడా అనుకుంటూ లోపలికెళ్ళాం. ఎదురుగా నటవీరభయంకర నటించు 'డాకుగాడు' బోర్డుకనిపించింది "లాభంలేదు బ్రదర్ ఈ సినిమాను ఇదివరకు చూసి మూడురోజులు క్యాజువల్ లీవ్ పెట్టాను ఎక్కిళ్ళతో..పరమదారుణం!" అంటూ మళ్ళీ కిసకిసమని నవ్వాడు మావాసరేశ్వరుడు. మూతి బిగదీసుకుని కూర్చున్న మా సుందరి కేసి చూసి "ఏం వెళ్దామా సినిమాకి" అనడిగాను.

"ఒద్దులెండి" ముక్కు మూరెడు సాగదీస్తూ, మొహాన్ని పదహారు వంకలు తిప్పింది మా సుందరి. ఇవేళ నాకు మూడిందని ముందే గ్రహించిన నేను స్కూటర్‌ను ముందుకుపోనిచ్చా. చెరుకురసం తాగుతావా అని అడిగే ధైర్యం కూడా కలగలేదు. ఏం చేయను "భార్యే శరణం గచ్ఛామి" కదా?!!

కొత్తవూరు. కొత్త ఉద్యోగం. కొత్త పెళ్ళాంతో సినిమా చూద్దామంటే ఎన్ని అవాంతరాలు మొత్తం మీద ఇంటికొచ్చేసరికి మా వెంకట్రావు పెరటి గోడమీద కూర్చుని పక్కింటి వాళ్ళతో జోకులాడుతున్నాడు. ఆహా! ఎంతటి లోకాతీతుడు!!

మమ్మల్ని మా వాడిపోయిన మొహాల్ని చూసి, అందునా ఆడవాళ్ళ చిర్రుబుర్రులు చూసి వచ్చార్లెండి వెధవల్లారా అని మనసులోనే సంతోషించి "ఏం సార్ సినిమా టికెట్లు దొరకలేదా?" అని ఆరా తీశాడు "అయినా ఆదివారం పూట ఏం దొరుకుతాయండి? అసలు నన్నడిగితే ఆదివారం నాడు శుభ్రంగా వేపలో మాంసమో ఏదో ఒకటి శుచిగా వండుకొని సుష్టుగా భోంచేసి బెస్ట్‌గా రెస్ట్ తీసుకోవాలండి" అని ప్రారంభించాడు.

తలనొప్పిగా ఉందని చెప్పిలోపలికి వచ్చి



'నువ్వెప్పుడు 'ముద్దు' అడిగినా అభ్యంతరం చెబుతావెందుకు డియర్.?'

'లిప్‌స్టిక్ చెదిరిపోతుందని' ఒయ్యారంగా చెప్పింది మృదుల.

మహర్షి, కొత్తగూడెం

చూస్తే మా ఆవిడ చీరైనా మార్చుకోకుండా అలకపాన్పెక్కింది. నెమ్మదిగా దగ్గరికి వెళ్ళి "అది కాదు సుందరీ" అని పలకరించబోతే ఖస్సుమని లేచి ఉరిమి చూసి మళ్ళీ అటు తిరిగి పడుకుంది.

ఇక లాభంలేదనుకుని బయటికి వచ్చి చూస్తే మా వాసరేశ్వరుడు బయట అరుగుమీద కూర్చుని ఓ పంక కిళ్ళీ నములుతూ మరో పంక సిగరెట్ కూడా పీల్చేస్తున్నాడు. ఆయన ఇంట్లోంచి ఆయనగారి శ్రీమతి చెంబులూ, తపేళాలు విసిరేస్తూ వెస్ట్రన్ మ్యూజిక్ సృష్టిస్తుంటే వాళ్ళ రాజ్‌గాడు మళ్ళీ వాడి భయంకర రాగంతో ఆలాపన ప్రారంభించాడు. వాళ్ళాయనా, ఆ సినిమా హాలు వాడూ ఇద్దరూ కలిసి కుట్రపన్ని ముందుగానే టికెట్లు అమ్మించేరని ఆమెగారి ధృఢాభిప్రాయం.ఇంట్లో చేస్తోన్న సందడి చాలక బయటికి వచ్చి "మీరు అనక అనక సినిమాకు తగలడ్దాం రమ్మంటేనే అనుకున్నాను"అని రాగం తీస్తూ మధ్యలో నన్ను చూసి ఆపేసింది. మళ్ళీ ఏమనుకుందో ఏమో లోపలికెళ్ళి ఓ పాత చాప, ఓ దిండూ బయటికి గిరాటేసి ధబీల్మని తలుపేసుకుంది. వాసరేశ్వరుడి మొహం చూశా! చాలా నిర్వికారంగా కిళ్ళీ నములుతూనే ఉన్నాడు. నా వేపు చూసి "కంగారు పడకండి మేస్టారు, పొద్దుటికల్లా మామూలైపోతుంది. ఫ్యామిలీ లైఫ్‌లో చాలా కామన్ థింగ్ ఇది" అని కిసకిసనవ్వి కానుగ చెట్టుకింద చాప పర్చుకుని 'గుడ్‌నైట్' అన్నాడు.

సుందరే కొంత బెటరనుకుని లోపలికెళ్ళాను. అవతలి వాటాలోంచి వెంకట్రావు భయంకరంగా గుర్రుపెడుతోన్న చప్పుడు వినిపిస్తోంది. అతనే అదృష్టవంతుడు.. ఏ బాధాలేదు.

మెల్లగా బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి చూశా! సుందరి అటు తిరిగి పడుకుంది. ఇప్పటికయినా కోపం తగ్గిపోయి ఉంటుందిలే అని ధైర్యం చేసి నెమ్మదిగా సుందరి పక్కన చేరి అలా చేయి వేశానో లేదో సివంగిలా లేచింది... "అదికాదు సుందరి నువు నిద్రపోతున్నావో లేదోనని" నసిగాడు.

"చాల్లెండి సరసం... టిక్కెట్ సంపాయించడం చేతకాదు కానీ సినిమా పత్రికలో పని చేశారట. పని.. ఎందుకు.. హు" అని దుప్పటి కప్పుకుని మరీ పడుకుంది...

జన్మకో శివరాత్రిలా, ఈ ఆదివారం ఇలాగయినందుకు ఒక నిట్టూర్పు బయటికి వచ్చింది. రాసూడదని ఆపుకునేలోపలే... ఇంతలో కరెంట్ పోయింది. అప్పటి దాకా ఉన్న కాస్త మూడ్ పాడయింది. రాత్రంతా జాగారం!!! సంసారం... సంసారం, ప్రేమసుధాపూరం.. దూరంగా ఎక్కడినుంచో మైకు ద్వారా ఘంటసాలగారి స్వరం వినిపిస్తోంది.

